ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.17.02.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కులగణన వివరాల నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, తొలి విడత సర్వే లో పాల్గొనని వారు ఇప్పుడు తెలంగాణ జనాభా లెక్కల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.
2. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన BC లకు సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు కల్పించాలన్నదే తమ పార్టీ అభిమతమని మంత్రి సీతక్క అన్నారు.
3. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో బీసీలకు న్యాయం కంటే అన్యాయం ఎక్కువ జరుగుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు.
4. సూర్యాపేట జిల్లా దురాజ్ పల్లి పెద్దగట్టు జాతర వైభవోపేతంగా జరుగుతోంది. జాతరను పురస్కరించుకొని ఈ రోజు నల్లగొండ జిల్లాలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

--------------------

**కులగణన-పొన్నం ప్రభాకర్**

కులగణన వివరాల నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, మొదటి సర్వేలో పాల్గొనని వారు, సమాచారం ఇవ్వని వారు ఈ అవకాశాన్ని

ఉపయోగించుకొని తెలంగాణ జనాభా లెక్కల్లో ఇప్పుడు భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడంతోపాటు 42 శాతం రిజర్వేషన్లకు రాజకీయ, విద్య, ఉద్యోగ అవకాశాల్లో చట్ట బద్దత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కులగణనలో పాల్గొనని వారు ఈనెల 28 వరకు నమోదు చేసుకోవచ్చని, దీని కోసం టోల్ ఫ్రీ నంబర్ 040-211 11111ను ఏర్పాటు చేశామన్నారు. తాము కుల సర్వేలో పాల్గొనలేదని ఈ నంబర్ కు ఫోన్ చేసి చెబితే ఎన్యుమరేటర్లు వారి నివాసాలకు వెళ్లి వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం, వార్డు ఆఫీసులకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. గత డిసెంబర్ లో జరిగన కులగణన సర్వేలో 3 లక్షల 56 వేల 323 కుటుంబాలు పాల్గొనలేదని తెలిపారు.

(డెస్క్)

---------------------

**కాంగ్రెసు-BJP:**

కుల గణన అంశాన్ని పక్కదారి పట్టించేందుకే BJP నాయకులు తమ పార్టీ నాయకులు రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క ఆరోపించారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని హైదరాబాద్ లో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన BC లకు

సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు కల్పించాలన్నదే తమ పార్టీ అభిమతం అని ఆమె స్పష్టం చేశారు. త్యాగాల వారసత్వంతో సమాజ అభివృద్ధి కోసం, సమసమాజ లక్ష్యం కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నరన్నారు. ఇలా ఉండగా, భారత రాజ్యాంగం కులం గురించి ప్రస్తావించలేదని BJP ప్రతినిధి BV సుభాష్ పేర్కొన్నారు. కాంగ్రెసు పార్టీ రాష్ట్రంలో కులగణన ప్రక్రియను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు.

**(MSL)**

--------------

**కరీంనగర్- బండి సంజయ్**

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో బీసీలకు న్యాయం కంటే అన్యాయం ఎక్కువగా జరుగుతోందని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ నేతలు బీసీల జనాభా తగ్గించే కుట్ర చేస్తున్నరని ఆరోపించారు. నిన్నరాత్రి కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో జరిగిన 'స్వదేశీ మేళా'' ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు.

**(పిటిసి, కరీంనగర్ )**

-----------------------

**నాగర్ కర్నూల్ సభ- మంత్రి జూపల్లి కృష్ణారావు**

కులగణన గణాంకాల ఆధారంగా జనాభా నిష్పత్తి ప్రకారం ఆయా కులాలకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నిన్న రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సగర శంఖారావం సభకు కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సగరులను బిసి-డి నుంచి బిసి-ఏకు మార్చడానికి గతంలో జీఓలు వచ్చాయని, అవి కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

**(PTC. నాగర్‌కర్నూల్ జిల్లా)**

-----------------------

**ఇంటర్-ప్రాక్టికల్స్**

ఇంటర్మీడియట్ చివరి విడత ప్రాక్టికల్ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు మొదలవుతాయి. ఈనెల 22 వరకు జరుగుతాయి. ఒకటి, రెండు, మూడో విడతల ప్రాక్టికల్ పరీక్షలలో గైర్హాజరైన విద్యార్థులు కోసం ఇంటర్ బోర్డు ఆఖరి విడత పరీక్షలను ఏర్పాటు చేసింది.

**(డెస్క్)**

-----------------------

**కేసీఆర్ బర్త్ డే-సీఎం రేవంత్**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు

ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో చంద్రశేఖర్ రావు జీవిత, రాజకీయ ప్రస్థానంతో కూడిన ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు, పలువులు ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

(డెస్క్)

---------------------

**సిరిసిల్ల-గనుల శాఖ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అక్రమంగా మట్టితవ్వకాలు జరు పుతున్న ప్రాంతాలపై నిఘా ఉంచినట్లు, జిల్లా గనుల శాఖ సహాయ సంచాలకులు క్రాంతి తెలిపారు. ఇటీ వల పలు మండలాల్లో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న వారిని పట్టుకుని జరి మానాలు విధించినట్టు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భూమిలో మట్టి తవ్వకాలకు ఆన్ లైన్ లో అనుమతులకు గనుల శాఖ వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకునేందుకు ఏర్పాట్లు జరిగాయని, విధివిధానాలను కూడా సిద్ధం చేశామన్నారు.

**(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

---------------------

**పెద్దగట్టు జాతర**

సూర్యాపేట జిల్లా దురాజ్ పల్లి పెద్దగట్టు జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐదు కోట్ల రూపాయలు కేటాయించిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. దురాజ్ పల్లి శ్రీ  లింగమంతుల స్వామి దేవాలయంలో మంత్రి ఈ ఉదయం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతర గత రాత్రి ప్రారంభమైంది. యాదవ్ వంశస్థులు కేసారం గ్రామం నుంచి అందంగా అలంకరించిన దేవరపట్టెను  అత్యంత భద్రత నడుమ గత రాత్రి పెద్దగట్టుకు చేర్చి పూజలు నిర్వహించారు. మెంతబోయిన, గొర్ల, మున్న వంశస్థుల సమక్షంలో రెండు బోనాలను వండి స్వామి అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం భక్తుల సందర్శన కొనసాగింది. అర్ధరాత్రి నుంచి భక్తులు ట్రాక్టర్లలో గుట్టకు చేరుకొని మొక్కలు తీర్చుకుంటున్నారు. జాతర గురించి మా ఆకాశవాణి  ప్రతినిధి మంజుల చక్కిలం అందిస్తున్న మరిన్ని వివరాలు....

**---------------బైట్-------------**

**(Suryapet/PTC),**

----------------------------------

**నల్లగొండ-సెలవు**

పెద్దగట్ట జాతర సందర్భంగా నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ రోజు సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. జాతర సందర్భంగా హైదారాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై

నల్లగొండ జిల్లా పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. విజయవాడ వైపు వెళ్ళే వాహనాలను నార్కట్ పల్లి, నల్లగొండ మీదుగా కోదాడ వైపు మళ్లించారు. హైదారాబాద్ కు వచ్చే వాహనాలను కోదాడ నుంచి నల్లగొండ మీదుగా మళ్లిస్తున్నారు. అలాగే ఖమ్మం వైపు వెల్లె వాహనాలను టేకుమట్ల నుంచి ఖమ్మం వెళ్ళే బైపాస్ మీదుగా మళ్లిస్తున్నారు.

**(పిటిసి, నల్లగొండ)**

----------------------

**యాదాద్రి-రథయాత్ర**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చేపట్టనున్న స్వామి వారి అఖండజ్యోతి రథయాత్ర ఈ నెల 26న హైదరాబాద్ లోని బర్కత్ పురాలోని యాదాద్రి భవనం నుంచి ప్రారంభమవుతుందని రథయాత్ర ఆహ్వాన కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పల్, ఘట్కేసర్, బీబీనగర్, భువనగిరి మీదగా రథ యాత్ర సాగుతుందని, మార్చి1వ తేదీన యాదగిరిగుట్టకు చేరుకుంటుందన్నారు.

**(పీ టీ సీ యాదాద్రి భువనగిరి)**

-------------------------

**సిరిసిల్లకలెక్టర్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రతి రోజు కామన్ డైట్ మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. తంగళ్లపల్లిలోని సిరిసిల్ల మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ ఈ రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**(పిటిసి, రాజన్న సిరిసిల్ల)**

----------------------------

**పెద్దపల్లి-కలెక్టర్**

పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి హాజరును ముఖ గుర్తింపు పద్ధతి (ఎఫ్.ఆర్.ఎస్) ద్వారా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలను కలెక్టర్ ఈ ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు, పనిచేసే ఉపాధ్యాయుల హాజరును ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా సేకరించి వివరాలు ఆన్ లైన్ నమోదు చేయాలన్నారు.

**(పెద్దపల్లి పీటీసీ)**

----------------------------

**సిరిసిల్ల మిడ్ మానేరు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ) లోకి నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కుడికాల్వ ద్వారా 400 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 5 క్యూసెక్కుల మేర నీరు

విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రాజెక్టులోకి 196 క్యూసెక్కుల స్వల్ప ఇన్ ఫ్లో వస్తోందని, ప్రస్తుత నీటిమట్టం 19.64 టీఎంసీలకు చేరిందన్నారు.

**(పిటిసి, రాజన్న సిరిసిల్ల)**

-------------------------------

**నుమాయిష్**

హైదరాబాద్ నాంపల్లిలో గత నెల 3వ తేదీ నుంచి జరుగుతున్న అఖిల భారత వస్తు పారిశ్రామిక ప్రదర్శనశాల -నుమాయిష్ ఈ రోజుతో ముగుస్తుంది. ఈ నెల 15వ తేదీతోనే ఎగ్జిబిషన్ ముగియాల్సి ఉండగా, ఇటీవల అధికారులు మరో రెండు రోజులు పొడిగించారు. ఆఖరి రోజు కావడంతో నేడు సందర్శకుల రద్దీ పెరిగే అవకాశం ఉంది.

**(డెస్క్)**

--------------------